సాక్షి తిరుపతి

7

సోమవారం ၊ 30 ၊ డిసెంబర్ ၊ 2024

● కౌంట్‌డౌన్

నేడు పీఎస్‌ఎల్‌వీ సి–60 ప్రయోగం

భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) మరో ప్రతిష్టాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి సోమవారం రాత్రి 9.58 గంటలకు పీఎస్‌ఎల్‌వీ సీ60 ఉపగ్రహ వాహకనౌకను ప్రయోగించనుంది. ఈ మేరకు ఆదివారం రాత్రి 8.58 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించింది. ఈ పర్యాయం స్పాడెక్స్ పేరుతో రెండు జంట ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపనుంది. 44.5 మీటర్ల పొడవు, 229 టన్నుల బరువైన ఈ రాకెట్ నింగికి పయనం కానుంది. పీఎస్‌ఎల్‌వీ సిరీస్‌లో ఇది 62వది కాగా, షార్ నుంచి 99 ప్రయోగం కావడం విశేషం. – సూళ్లూరుపేట



రాకెట్ అనుసంధానం చేస్తున్న శాస్త్రవేత్తలు



హీట్‌షీల్డ్ క్లోజ్ చేస్తున్న దృశ్యం



ప్రయోగానికి సిద్ధంగా రాకెట్

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైను ఎంబీసీ వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 78,414 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,100 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.45 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలో అనుమతించమని స్పష్టం చేసింది.

క్యాన్సర్‌పై పరిశోధనలు అవసరం



స్విమ్ డైరెక్టర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి సిటీ : క్యాన్సర్‌పై సరికొత్త పరిశోధనలు అవసరమని స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్‌వీ కుమార్ తెలిపారు. ఆదివారం ఎస్వీయూ బయోటెక్నాలజీ విభాగం, అమెరికా అలబామా వర్సిటీ ఆధ్వర్యంలో బయో టెక్నాలజీ, మెడిసిన్, ప్రివెన్షన్ ఆఫ్ క్యాన్సర్, థెరపీ అనే అంశంపై మూడు రోజులగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ఆదివారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ నివారణకు ఆంకాలజీ విభాగం విశేషంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రస్తుతం అడ్వాన్స్‌డ్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ నివారణకు జన్యుపరమైన వైవిధ్యాలను బయోటెక్నాలజీ ద్వారా గుర్తించారని వివరించారు. అనంతరం సదస్సుకు హాజరైన అతిథులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ ఫార్మా కాలేజీ ప్రిన్సిపల్ ఓవీ రెడ్డి, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ సరిత, మిథున్, ఒప్పంద అధ్యాపకుడు జ్యోతి కుమార్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ డే నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతులు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా అన్నిశాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు.

పోలీసు 'గ్రీవెన్స్' రద్దు

తిరుపతి క్రైం: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేను రద్దు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కొన్ని అనివార్య కారణాలవల్ల రద్దు చేశామని ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

● త్రివర్ణ శోభితం



తిరుపతి నగరంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న బాలోత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శ్రీకోదండరామస్వామి ఉన్నత పాఠశాల విద్యార్థినులు జాతీయ జెండా రంగులతో కూడిన దుస్తులను ధరించడం విశేషంగా ఆకట్టుకుంది. – తిరుపతి కల్చరల్

అధికారమే పరమావధిగా చంద్రబాబు మరోసారి ప్రజలకు కుచ్చుటోపీ పెట్టారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించారు. సూపర్ సిక్స్ పేరుతో మాయమాటలు వల్లించారు. గద్దెనెక్కిన తర్వాత ఆర్థికలోటు అంటూ కాలయాపన చేస్తున్నారు. ఏడు నెలలు గడుస్తున్నా.. సంక్షేమ పథకాలను అమలు చేయకుండా గాలికి వదిలేశారు. సంపద సృష్టిస్తామని ఊదరగొట్టి.. కక్ష సాధింపు చర్యలకే పెద్దపీట వేస్తున్నారు. ప్రశ్నించిన గొంతుకలను నిర్దాక్షిణ్యంగా నొక్కేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రజలు సైతం గతంలో వైఎస్సార్‌సీపీ సర్కారు చిత్తశుద్ధిని గుర్తుచేసుకుంటున్నారు. జగనన్న పాలనతో చంద్రబాబు పనితీరును బేరీజు వేసుకుంటున్నారు. బాబు చెప్పే మాటలన్నీ నీటి మూటలని మళ్లీ రుజువైందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – తిరుపతి సిటీ

బాబు మాట..
నీటి మూట!



ఏడు నెలలుగా స్తంభించిన ప్రజా సంక్షేమం

- పథకాలను అమలు చేయని ప్రభుత్వం
- సూపర్ సిక్స్ పేరిట కూటమి నేతల మోసం
- కాలయాపన చేస్తున్న చంద్రబాబుపై వెల్లువెత్తుతున్న ఆగ్రహం
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో చేకూరిన లబ్ధిని గుర్తుచేసుకుంటున్న జనం

ఎప్పడిస్తారో దేవుడికే తెలియాలి



ఎన్నికల ముందు అవి ఇస్తాం.. ఇవి ఇస్తామంటూ కూటమి నేతలు ఓట్లు వేయించుకున్నారు. అధికారంలోకి వచ్చాకా ఆ మాటే పట్టించుకోలేదు. కనీసం కొత్త పెన్షన్ల మాట కూడా ఎత్తడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి, పిల్లలకు ట్యాబ్‌లు, వాహన మిత్ర, చేదోడు తదితర పథకాలు మాకు అందాయి. ఇంటి స్థలం కూడా ఇచ్చారు. మా అబ్బాయికి ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన ఏటా క్రమం తప్పకుండా పడింది. ఈ ఏడాది ఒక్క పథకం లేదు. గ్యాస్ సిలిండర్ తప్ప ఎటువంటి లబ్ధి చేకూరలేదు. ఉద్యోగాల కోసం పిల్లలు ఎదురు చూస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. – రమాదేవి, గృహిణి, తిరుపతి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..	
విద్యాదీవెన	రూ. 20,000
వసతి దీవెన (రెండు దఫాలు)	రూ. 12,400
అమ్మ ఒడి	రూ. 14,000
చేదోడు	రూ. 10,000
ఆసరా	రూ. 17,250
డ్వాక్రా వడ్డీ మాఫీ	రూ. 2,250
పిల్లలకు ట్యాబ్	రూ. 20,000
ఇంటి స్థలం విలువ(సుమారు)	రూ. 2,50,000
మొత్తం	రూ. 3,29,000

కూటమి పాలనలో ఇదీ పరిస్థితి	
ఫీజురీయింబర్స్‌మెంట్	లేదు
నిరుద్యోగ భృతి	లేదు
ఉచిత గ్యాస్	రూ.819
తల్లికి వందనం	లేదు
కొత్త పెన్షన్	లేదు
కొత్త రేషన్ కార్డు	లేదు
ఉచిత బస్సు ప్రయాణం	లేదు
మహిళకు భృతి	లేదు
మొత్తం	రూ.819

నిరాశే మిగిలింది



కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. అయితే మాకు నిరాశే మిగిలింది. ఏడు నెలలు గడుస్తున్నా సంక్షేమ పథకాల ఊసే ఎత్తడం లేదు. బడుగు, బలహీన వర్గాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మాకు రైతుభరోసా, డ్వాక్రా రుణంపై వడ్డీ మాఫీ, పంట బీమా, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, అమ్మ ఒడి, కాపు నేస్తం, ఆసరా, మా తమ్ముడికి వాహన మిత్ర అందాయి. ప్రస్తుతం మా కుటుంబానికి గ్యాస్ సిలిండర్ డబ్బు మాత్రమే పడింది. ఈ ఏడాది పింఛన్‌కు దరఖాస్తు చేసుకుందామన్నా అవకాశం ఇవ్వలేదు. ఇదే విధంగా పాలన కొనసాగితే రైతు పరిస్థితి కష్టమే. – పి.నరసయ్య, రైతు, శ్రీకాళహస్తి

జగనన్న పాలనలో పథకాల పండుగ	
రైతు భరోసా	రూ. 13,500
అమ్మ ఒడి	రూ. 14,000
డ్వాక్రా వడ్డీ	రూ. 2,220
పంట బీమా	రూ. 12,000
కాపు నేస్తం	రూ. 15,000
ఆరోగ్యశ్రీ లబ్ధి	రూ. 2,06,000
మొత్తం	రూ. 2,62,721

ఈ ఏడాది బాబు అందించింది ఇదీ..	
పంట రుణం	లేదు
తల్లికి వందనం	లేదు
ఉచిత బస్సు	లేదు
అన్నదాత సుఖీభవ	లేదు
గ్యాస్ సిలిండర్	రూ.819
కొత్త పెన్షన్	లేదు
మొత్తం	రూ.819

పెన్షన్ మాత్రమే ఇచ్చారు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్థికంగా కొంత ఉపశమనం కలిగింది. ప్రస్తుతం కుటుంబ ఖర్చులకు కూడా కష్టంగా ఉంది. జగనన్న పాలనలో ప్రతి ఏడాది సంక్షేమ పథకాలన్నీ క్రమం తప్పకుండా అందాయి. ఇంటి స్థలం, అమ్మ ఒడి, చేయూత అందించారు. మాకు ఇద్దరు పిల్లలు, భర్త, అత్తతో కలిసి జీవిస్తున్నాం. అత్తమ్మకు పెన్షన్ తప్ప మాకు ఏమీ రావడంలేదు. ఈ ఏడాది తల్లికి వందనం, ఉచిత బస్సు పథకాల మాటేలేదు. – వెంకటలక్ష్మి, విద్యానగర్, గూడూరు

గత ఏడాది అందించిన పథకాలు	
అమ్మ ఒడి	రూ. 14,000
ఇంటి స్థలం (విలువ)	రూ. 1,50,000
చేయూత	రూ. 18,750
డ్వాక్రా వడ్డీ	రూ. 2,250
చేదోడు	రూ. 10,000
మొత్తం	రూ. 1,95,000

గత ఏడు నెలలుగా అందినవి	
తల్లివందనం	లేదు
పెన్షన్ నెలకు 4వేలు	36,000
ఉచిత బస్సు	లేదు
రుణాలు	లేదు
మహిళకు భృతి	లేదు
మొత్తం	రూ.36,000

ఒక్క పైసా అందలేదు



నేను టైలర్‌ని. రోజంతా కష్టపడ్డా తిండికి కూడా సరిపోదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న చేదోడు కింద ఏటా రూ.10వేలు చొప్పున అందింది. మా భార్యకు వైఎస్సార్ చేయూత, వడ్డీ మాఫీ జరిగింది. దీంతో పాటు మా కుమారుడి పిల్లలకు సైతం అమ్మ ఒడిని ఏటా క్రమం తప్పకుండా అందించారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి అందలేదు. చంద్రబాబు ఏదో చేస్తారని నమ్మాం. ఆయన ఏదీ అమలు చేయడం లేదు. పూట గడవడం కూడా కష్టంగా ఉంది. – వెంకటేష్, టైలర్, వరదయ్య పాళెం

గత ఏడాది అందిన సాయం	
జగనన్న చేదోడు	రూ. 10,000
వైఎస్సార్ చేయూత	రూ. 18,750
వైఎస్సార్ ఆసరా	రూ. 17,200
డ్వాక్రా వడ్డీ	రూ. 2250
అమ్మ ఒడి	రూ. 14,000
మొత్తం	రూ. 62,000

ఇప్పుడు ముట్టింది ఇలా..	
తల్లికి వందనం	లేదు
పెన్షన్లు	లేదు
గ్యాస్ సిలిండర్	రూ.819
అన్నదాత సుఖీభవ	లేదు
ఉచితబస్సు ప్రయాణం	లేదు
మొత్తం	రూ.819

తవ్వకాల తకరారు!

కాసులు పోగేసుకోవడమే లక్ష్యంగా కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. సులువుగా రూ.కోట్లు కూడబెట్టుకునేందుకు గనులను ఎంచుకున్నారు. యథేచ్ఛగా మైకా, సిలికా ఖనిజాలను దోచుకునేందుకు పోటీపడుతున్నారు. ఈ క్రమంలో తిరుపతి, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు రాష్ట్రస్థాయిలో పైరవీలకు తెరతీస్తున్నారు.

కూటమిలో మైనింగ్ చిచ్చు

- టీడీపీ ఎంపీకి మైకా గనుల వ్యవహారాలు అప్పగింత
- చక్రం తిప్పిన ఇద్దరు 'ముఖ్య' నేతలు
- తమకే కేటాయించాలని తిరుపతి జిల్లా తమ్ముళ్ల పట్టు
- వాటాల కోసం పట్టుబడుతున్న జనసేన నాయకులు
- పంపకాల్లో కుదరని సయోధ్య



మైకాను లోడ్ చేస్తున్న దృశ్యం



టిప్పర్‌లో సిలికా లోడింగ్

సాక్షి తిరుపతి టాస్క్‌ఫోర్స్: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాలోని కూటమి నేతల మధ్య మైనింగ్ వ్యవహారం చిచ్చురేపుతోంది. సైదాపురం, గూడూరు పరిధిలోని మైకా క్వార్ట్జ్ గనుల కోసం కొట్టుకునే పరిస్థితి తలెత్తినట్లు సమాచారం. గనులు లీజు ఉన్నా.. తవ్విన ఖనిజాన్ని తనకే విక్రయించాలంటూ నెల్లూరు జిల్లాకు చెందిన ఓ బడా పారిశ్రామిక వేత్త, ప్రజాప్రతినిధి హుకుం జారీ చేశారు. అయితే తిరుపతి జిల్లా వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట ప్రాంతాలకు చెందిన నేతలతోపాటు, నెల్లూరు జిల్లాకు చెందిన కూటమి నేతలు కూడా గనుల కేటాయింపులు తమకే కావాలని పట్టుబడుతున్నారు. మైకా గనులు, సిలికాను దక్కించుకునేందుకు ఎవరికి వారు పోటీపడుతున్నారు. మరో వైపు లీజు దారులంతా ఏకమై ఎవరైతే ఎక్కువ ధర కోట్ చేస్తారో వారికే విక్రయించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు లీజు దారులంతా శనివారం చిల్లకూరులో రహస్యంగా సమావేశమై చర్చించుకున్న విషయం తెలిసిందే.

దాడులు, దౌర్జన్యాలు

తెల్లరాయికి చైనాలో మంచి డిమాండ్ ఉండడంతో మైకా గనులపై కూటమి నేతల కన్నేశారు. ఖనిజానికి స్థానికంగానే రూ.25వేల నుంచి రూ.2లక్షలకు ధర పలుకుతుండడంతో ఈ గనులను తమ గుప్పెట్లో పెట్టుకునేందుకు వ్యాపారులను రకరకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రూ.కోట్ల విలువైన ఖనిజ సంపదను దోచుకునేందుకు పథకం వేశారు. తమ చేతికి మట్టి అంటకుండా ఉండేందుకు ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పే నెల్లూరుకు చెందిన బడా పారిశ్రామికవేత్త అయిన ఓ ప్రజాప్రతినిధికి బాధ్యతలు అప్పగించారు. ఆయనన నెల్లూరు జిల్లాకు చెందిన ఓ యువ నాయకుడిని రంగంలోకి దింపినట్లు సమాచారం. ప్రతి నెలా రూ.30 కోట్లు కప్పం చెల్లించేలా ఒప్పందం కుదిరినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే గనులన్నింటినీ సొంతం చేసుకునేందుకు టీడీపీ నేతలు దౌర్జన్యాలకు దిగుతున్నారు. అధికారుల ద్వారా లైసెన్స్ దారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకువస్తున్నారు. బెదిరింపులకు లొంగని వారిపై దాడులకు సైతం తెగబడుతున్నారు. అందులో భాగంగానే ఇటీవల సైదాపురంలోని ఓ మైకా గనిలో పచ్చ మూక చొరబడి విధ్వంసం సష్టించిన విషయం తెలిసిందే. టీడీపీ నేతలకు అధికారులు వంత పాడుతున్నారని, గనులు సరెండర్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఓ వ్యాపారి కన్నీరుమున్నీరు కావడం గమనార్హం. మైనింగ్ పోర్టల్ సర్వర్‌లోని ఐడీలను కూడా బ్లాక్ చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గనులశాఖ మంత్రిని కలిస్తే, యువ నాయకుడిని కలవమని ఉచిత సలహా ఇచ్చినట్లు తెలిసింది. దీంతో చేసేది లేక కూటమి నేతలకు కొందరు గనుల యజమానులు లొంగిపోయినటు సమాచారం.

పెరిగిన డిమాండ్

సైదాపురంలో ఏడు భూగర్భ గనులు, 140 మైకా క్వార్ట్జ్ గనులున్నాయి. మరో వందేళ్ల వరకు ఇక్కడ ఖనిజ నిక్షేపాలకు కొదవ ఉండదని నిపుణులు చెబుతున్నారు. వీటిపై ఆధారిత పరిశ్రమలు వందకుపైగా నడుస్తున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మంది కూలీలు జీవనోపాధి పొందుతున్నారు. ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్‌లో వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం మండలంలో లభించే ఖనిజాన్ని చైనా, జపాన్, రష్యా దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. గతంలో మైకా క్వార్ట్జ్‌కు అంతంత మాత్రమే ధర ఉండేది. 8 నెలలుగా మైకా క్వార్ట్జ్‌కి విదేశాల్లో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. చైనాలోని సెమీ కండక్టర్ పరిశ్రమలల్లో మైకా వినియోగిస్తున్నారు. దీంతో మంచి అవకాశం వచ్చిందని గనుల వ్యాపారులు సంబరపడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు చల్లింది. అధికారం చేపట్టిన వెంటనే తవ్వకాలు, ఎగుమతులను నిలిపివేసింది. 'ముఖ్య' నేత అనుచరుడికి చెందిన ఓ గని, బాలకృష్ణ బంధువుకు చెందిన మరొక గనిలో మాత్రమే తవ్వకాలు, ఎగుమతులకు అవకాశం కల్పించింది. ఆరు నెలల తర్వాత, తొమ్మిది గనులకు అనుమతులు మంజూరు చేసింది. తాజాగా మరో 11 గనులకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లుసమాచారం. మైకా క్వార్ట్జ్ కోసం విదేశీయులు వచ్చి వెళుతున్న విషయం తెలుసుకున్న నెల్లూరుకు చెందిన టీడీపీ నేత రూప్‌కుమార్ యాదవ్, మరి కొందరు ఇటీవలే చైనా పర్యటన చేపట్టారు. కొద్దిరోజులు అక్కడే తిష్టవేసి విదేశీయులతో సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది.

నేతల మధ్య యుద్ధం

గనులన్నింటినీ బడా పారిశ్రామికవేత్త, ప్రజాప్రతినిధికి అప్పగించడంపై తిరుపతి, నెల్లూరు జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు రగిలిపోతున్నారు. దీనిపై ఎమ్మెల్యేలు, జనసేన నేతలు కొందరు నేరుగా 'ముఖ్య' నేతల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అయితే వారి నుంచి నామమాత్రపు స్పందన రావడంతో సీఎంఓ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు సమాచారం. సీఎంఓ అధికారులు మాత్రం 'గనులన్నింటినీ ఆ ఎంపీకి అప్పగించేశాం..ఏమైనా పంచాయితీలుంటే ఆయన వద్దనే తెల్చుకోండి' అని చెప్పినట్లు తెలిసింది.

మాస్టర్ ప్లాన్ పనుల పరిశీలన



ప్లాన్ పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మాస్టర్ ప్లాన్ పనులను ఈఓ బాపిరెడ్డి, ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. అందులో భాగంగా కన్నప్పసేతు నుంచి స్వర్ణముఖి కట్ట మీదుగా భరద్వాజ తీర్థం వరకు ఏర్పాటు చేయాల్సిన 40 అడుగుల రోడ్డుకు స్థల సందర్శన చేపట్టారు. ఈ మేరకు సేకరించాల్సి 17 సెంట్ల ప్రైవేటు స్థలాన్ని గుర్తించారు. కార్యక్రమంలో సర్వేయర్ పురుషోత్తం, ఆలయ అధికారులు మురళీధర్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



క్లుప్తంగా

నేడు జిల్లాకు కేంద్రమంత్రి రాక

రేణిగుంట : కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సోమవారం సాయంత్రం జిల్లాకు రానున్నారు. ఈ మేరకు రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ వనస్థలి సమీపంలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రైతు సదస్సులో పాల్గొంటారని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్ర కార్యక్రమాల ప్రగతిని పరిశీలించిన తర్వాత రైతులతో ముఖాముఖి చర్చించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా యంత్ర పరికరాలను రైతులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

ఉద్యోగం ఇప్పిస్తానని టోకరా

దొరవారిసత్రం : టీటీడీలో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి రూ.5లక్షలు టోకరా వేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు బాధితుడు రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ అజయ్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు.. మండలంలోని తల్లంపాడు గ్రామానికి చెందిన జయప్రకాష్ అనే యువకుడిని టీటీడీలో ఉద్యోగం ఇప్పిస్తానని తడ మండలం మాంబట్టుకు చెందిన వి.మునస్వామి నమ్మించాడు. ఈ క్రమంలో మాయమాటలు చెప్పి రూ.5లక్షలు వసూలు చేసి తర్వాత ముఖం చాటేశాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్‌గా కృష్ణప్రసాద్



నియామక పత్రం అందుకుంటున్న కృష్ణప్రసాద్

తిరుపతి కల్చరల్ : వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్‌గా తిరుపతికి చెందిన ఆర్కాట్ కృష్ణప్రసాద్ నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం ఏలూరులో నిర్వహించిన రాయలసీమ, తమిళనాడు, కర్ణాటక, కేరళకు చెందిన వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశంలో నియామకపత్రం అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ వాకర్స్ ఆరోగ్య పరిరక్షణకు తన వంతు కృషి చేస్తామని, సమాజ హితం కోసం సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు.

రుయా.. మందులు లేవయా!



రుయా.. ఇది పేరుకే పెద్దాస్పత్రి.. కాదు కాదు.. రాయలసీమకే పెద్ద ఆస్పత్రి .. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందాన తయారైంది ఈ హాస్పిటల్ పరిస్థితి. నాణ్యమైన వైద్యమే కాదు ఇక్కడ మందులూ కరువే. డాక్టర్లు రాసే మందుల స్లిప్పులతో రోగులు ప్రైవేట్ మెడికల్ షాపులకు పరుగులు పెట్టాల్సిన దుస్థితి దాపురిస్తోంది. పేదల ఆస్పత్రిని ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. కనీసం యాంటీబయాటిక్ మందులు, సర్జికల్ సామగ్రి, చివరకు నీడిల్స్ సైతం అందుబాటులో లేకపోవడంతో రోగులతోపాటు వైద్యులకు ఇబ్బందులు తప్పడం లేదు.



- పేదల ఆస్పత్రిని పట్టించుకోని ప్రభుత్వం
- యాంటీ బయాటిక్ మాత్రలు కూడా కరువే!
- 2 నెలలుగా ఇబ్బంది పడుతున్న రోగులు

తిరుపతి తుడా : తిరుపతిలోని రామ్‌నారాయణ్ రుయా గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రికి రోజూ 900 నుంచి 1,200 ఓపీలు వస్తుంటాయి. అలానే ఎమర్జెన్సీ కేసులు వంద నుంచి 170 వరకు నమోదవుతుంటాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచే కాకుండా వైఎస్సార్ కడప, నెల్లూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి కూడా రోగులు వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. టీచింగ్ ఆస్పత్రి అయినా నాణ్యమైన వైద్యం, మందుల సరఫరా ప్రశ్నార్థకంగానే మారుతోంది.

అరకొరగా యాంటీబయాటిక్స్

ప్రస్తుతం విష జ్వరాలు, సీజనల్ వ్యాధులు విపరీతంగా నమోదవుతున్నాయి. అయితే రోగుకు తప్పక ఇవ్వాల్సిన యాంటీబయాటిక్స్ మందులు రుయా ఆస్పత్రిలో ఉండడం లేదు. చివరకు టీటీ ఇంజెక్షన్లు సైతం కొరతగానే ఉంది.

మందుల కొరత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యరంగం కుదేలవుతోంది. నాణ్యమైన వైద్యంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. రుయాలో సుమారు రెండు నెలలుగా మందుల కొరత ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో రోగులు ప్రైవేట్ మెడికల్ షాపులకు వెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా గ్యాస్ట్రో, పల్మనాలజీ, షుగర్, సర్జికల్, ఆర్థో, కార్డియాలజీ సంబంధిత రోగులకు ఇవ్వాల్సిన మందులు రుయాలో ఉండడం లేదు. సెలైన్ బాటిళ్లు సైతం పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. ప్రతిరోజు 300 నుంచి 400 మంది రోగులు యూరిన్, రక్తపరీక్షలు చేయించుకుంటూ ఉంటారు. యూరిన్ పరీక్షల కోసం ఉపయోగించే కంటైనర్లు, టెస్ట్ ట్యూబ్లు, రక్త సేకరణకు వాడే చిన్న పాటి వైద్య సామగ్రి కూడా రుయాలో లేకపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

ఇలా నిర్వహిస్తే ఎలా?



నెమ్ము, ఆయాసంగా ఉండడంతో రుయా ఆస్పత్రికి వచ్చా. వైద్యులు పరీక్షించిన తర్వాత మందులు రాశారు. అందులో మూడు రకాల మందులు లేవని సిబ్బంది తిప్పి పంపేశారు. అవసరమైతే బయట కొనుక్కోమని చెబుతున్నారు. రూ.500 ఖర్చు పెట్టుకుని ఇక్కడికి వచ్చా. మందులు కొనుక్కునేందుకు డబ్బులు లేవు. ఊరుకు వెళ్లి మళ్లీ తిరుపతికి వచ్చే తీసుకోవాలి. అయినా ప్రభుత్వాస్పత్రులను ఇలా నిర్వహిస్తే మాలాంటి పేదల పరిస్థితి ఏంటి.

– పళని, కార్వేటినగరం, చిత్తూరు జిల్లా

అనేక ఇబ్బందులు



తీవ్ర అనారోగ్యం ఉండడంతో మూడు రోజులు క్రితం రుయాకు వచ్చా. వైద్యులు చూసిన తర్వాత యూరిన్, రక్త పరీక్షలు చేసుకోమన్నారు. ల్యాబ్‌కు వెళితే యూరిన్ డబ్బాలు, ట్యూబులు, సిరంజిలు బయట నుంచి తెచ్చుకోమన్నారు. సహాయకులు లేకపోవడంతో ఈ పరిస్థితిలో నేనే కిలోమీటర్ల దూరం వెళ్లి వస్తువులు తెచ్చుకున్నా. తీరా సమయం అయిపోయింది రేపు రండి అంటున్నారు. మందులు కూడా ఇక్కడ దొరకవు అని చెప్పి పంపేశారు.రుయాకు వైద్యం కోసం వస్తే అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నా.

– నాగమ్మ, నాగలాపురం, తిరుపతి జిల్లా

యూనిఫామ్‌కు రూ.16.64లక్షల విరాళం



సమావేశంలో ఎస్‌బీఐ అధికారుల సతీమణులు

తిరుపతి అర్బన్/ తిరుపతి సిటీ: ఎస్‌బీఐ ఉన్నతాధికారుల సతీమణులు ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ అమరావతి సర్కిల్ పేరుతో ఆదివారం తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర బాలమందిర్ స్కూల్ పిల్లల యూనిఫామ్‌కు రూ.16.64 లక్షలను విరాళంగా అందించారు. దీనిపై స్కూల్ యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎం లేఖా మీనన్‌తోపాటు చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి సతీమణి, సీజీఎం రాజేష్‌కుమార్ పటేల్ సతీమణి, జీఎం సంజయ్‌కుమార్ సతీమణి పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

తిరుపతి అర్బన్ : ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని, తిరుపతి బస్టాండ్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కడప జోన్‌-4 ఆర్టీసీ ఈడీ పైడి చంద్రశేఖర్ కోరారు. ఆదివారం ఆయన తిరుపతి బస్టాండ్‌ను పరిశీలించారు. దెబ్బతిన శ్లాబ్ పెచ్చులను తొలగించాలని సూచించారు. ప్రయాణికుల తోపాటు ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దుకాణదారులు ఎమ్మార్పీ ధరలకే వస్తువులను విక్రయించాలని చెప్పారు. తాగునీరు, మరుగుదొడ్ల విషయంలో నిత్యం నిఘా ఉంచాలని సూచించారు. బస్సుల కండిషన్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, తిరుపతి డీఎం బాలాజీ, ఏటీఎం డీఆర్ నాయుడు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో టెండర్ల కుంపటి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో టెండర్లు దక్కించుకునేందుకు కూటమిలో కుంపటి మొదలైంది. గత ఆరు నెలలుగా కొందరు టీడీపీ నేతలు ఆలయంలో తిష్టవేశారు. ఎవరైనా టెండరు వేయడానికి వస్తే దాడులకు సైతం పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే రూ.కోట్ల విలువైన పార్కింగ్ టెండరు దక్కించుకునేందుకు మూడు నెలలుగా చేయని ప్రయత్నాలు లేదు. సంవత్సరం నుంచి ఆలయమే పార్కింగ్ నిర్వహిస్తోంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్కింగ్ కాంట్రాక్ట్ దక్కించుకునేందుకు కూటమి నేతలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మొదటిసారి టెండర్ పిలిచినపుడు రూ.97లక్షలకు వేయగా అది చాలా తక్కువగా ఉందని అధికారులు రద్దు చేశారు. రెండవ సారి మళ్లీ టెండర్ పిలిచారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఈ టెండర్లలో తమకు అవకాశం కావాలని పోటీ పడ్డారు. బయటివారు టెండర్ వేసేందుకు అవకాశం ఇవ్వలేదు. కూటమి నుంచే ఓ కాంట్రాక్టరు రూ.1.20కోట్లకు వేయగా, మరొకరు రూ.1.58కోట్లకు కోట్ చేశారు. అయితే గత సంవత్సరం రోజులుగా ఆలయం తరపున నిర్వహిస్తే పార్కింగ్ నుంచి రూ.2.60కోట్ల వరకు వసూలు అవుతోందని అధికారులు లెక్కలు తీశారు. ఈ నేపథ్యంలో టెండర్ తక్కువకే కోట్ చేసినందును రద్దు చేసినట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు.

శివరాత్రి పనులైనా ఇవ్వండి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఖర్చును రూ.4కోట్లకు అధికారులు అంచనా వేశారు. దీంతో కూటమి నేతలు ఆ పనులు దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు. శివరాత్రి పనులైనా తమకు ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

స్వర్ణముఖిలో ఒకరి గల్లంతు



నాగూరయ్య (ఫైల్)

కోట: గేదెలు మేపేందుకు వెళ్లిన ఓ వ్యక్తి స్వర్ణముఖిలో గల్లంతైన ఘటన ఆదివారం మండలంలోని రుద్రవరంలో జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన నాగూరయ్య(46) నది ఒడ్డున గేదెలను మేపుతుండగా ఓ గేదె ప్రవాహంలోకి దిగింది. దాన్ని కాపాడబోయి నాగూరయ్య గల్లంతయ్యాడు. ఈమేరకు నదిలో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

ఖాతా నుంచి నగదు మాయం!

నాయుడుపేటటౌన్ : దొరవారిసత్రం మండలం నెలబల్లికి చెందిన నాగూరమ్మ నాయుడుపేట వెలుగు కార్యా లయంలో ఎఫ్‌పీఓ సీసీగా పనిచేస్తోంది. ఆరోగ్యం సరిగా లేక పోవడంతో ఆస్పత్రి ఖర్చులకు రూ.లక్ష నగదును అప్పుగా తీసుకుని తన బ్యాంక్ ఖాతాలో డిపాజిట్ చేసుకుంది. ఈ క్రమరంలో నాగూరమ్మ ఖాతా నుంచి గుర్తుతెలియని వ్యక్తి నగదు విత్ డ్రా చేసేశాడు. దీంతో బాధితురాలు వెంటనే బ్యాంకు సిబ్బందిని సంప్రదించింది. ఈ మేరకు వారు విచారిస్తున్నారు. అలాగే సైబర్ క్రైమ్ పోలీసులకు సైతం బాధితురాలు ఫిర్యాదు చేసింది.

హద్దు మీరితే సహించం

- ఎస్పీ సుబ్బరాయుడు



తిరుపతి క్రైం : ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని, సంబరాల పేరుతో హద్దు మీరితే సహించే ప్రసక్తే లేదని ఎస్పీ సుబ్బరాయుడు స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకలకు సంబంధించి మార్గ దర్శకాలను జారీ చేశారు.

- మద్యం తాగి రోడ్లపై కనిపిస్తే కేసులు తప్పవు.
- జిల్లావ్యాప్తంగా 31వ తేదీ రాత్రి 10 గంటల నుంచి వాహనాల తనిఖీ చేపడతాం.
- నిర్దేశించిన వేళకే వైన్‌షాపులు, బార్‌లు మూసివేయాలి.
- గరుడ వారధి, యూనివర్సిటీ ఫ్లైఓవర్‌పై 31వ తేదీ రాత్రి 10 గంటల తర్వాత ప్రవేశం ఉండదు.
- డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తాం.
- అశ్లీల నృత్యాలు, డీజే సౌండ్లు, రికార్డింగ్ డాన్స్‌లు నిర్వహించేందుకు అనుమతి లేదు.
- కారు, బైక్ రేసింగ్ పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.
- న్యూ ఇయర్ వేడుకల నిర్వహణకు హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, క్లబ్‌ల యాజమాన్యాలు ముందస్తుగా అనుమతి తీసుకోవాలి.
- సంక్రాంతి పండుగ నేపథ్యంలో జూదం, కోడి పందేలా నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.
- ఈవెంట్ నిర్వాహకులు తప్పనిసరిగా ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఈవెంట్‌లలో మత్తు పదార్థాలను వినియోగించకూడదు.
- విదేశీయులు హాజరైతే పోలీసులకు ముందస్తుగా సమాచారం అందించాలి.
- బైక్‌లపై ట్రిపుల్ రైడింగ్ చేస్తే కేసులు తప్పవు.

విద్యార్థులకు బహుమతులు



మాట్లాడుతున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో ఆదివారం గీతా జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన శ్లోకాల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి బహుమతులు ప్రదానం చేశారు. వీసీ మాట్లాడుతూ గీతా పారాయణం అలవరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్రీడా భారతి సౌత్‌జోన్ సెక్రటరీ చంద్రశేఖర్ జాగిర్దార్ పాల్గొన్నారు.

గూడూరులో కార్డన్‌సెర్చ్

– 20 బైక్‌ల స్వాధీనం



సీజ్ చేసిన ద్విచక్రవాహనాలు

గూడూరురూరల్: పట్టణంలోని బనిగే సాహెబ్ పేటలో ఆదివారం వేకువజామున వన్‌టౌన్ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహివంచారు. ఈ సందర్భంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 20 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ శేఖర్‌బాబు మాట్లాడుతూ అద్దెకు ఇల్లు ఇచ్చేముందు పూర్తి ఆధారాలు తీసుకోవాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే కార్డన్ సెర్చ్ చేపట్టినట్లు వెల్లడించారు.

పూరిల్లు దగ్ధం



బాధితులను పరామర్శిస్తున్న విజయభాస్కర్‌రెడ్డి

సైదాపురం : మండలంలోని గిద్దలూరు పంచాయతీ పరసారెడ్డిపల్లెలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు కాలిపోయినట్లు బాధితుడు మంగళపూరి శ్రీనయ్య తెలిపాడు. ఈ ప్రమాదంలో ఇంట్లో దాచిన రూ.3లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు అగ్నికి ఆహుతైనట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ నేత కంభం విజయభాస్కర్‌రెడ్డి వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని బాధిత కుటుంబీకులను పరామర్శించారు. తక్షణ సాయంగా రూ.50వేలు అందించనున్నట్లు వెల్లడించారు.

సౌకర్యాలున్నా..ప్ర'యోగం' లేదా?



జనవరి 1వ తేదీన ప్రయోగించిన పీఎస్ఎల్‌వీ సీ58 (ఫైల్)

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఈ ఏడాది కేవలం ఆరు ప్రయోగాలు మాత్రమే పూర్తి చేసింది. అందులో ఒక ప్రయోగం నవంబర్ 19న అమెరికాలోని ఫాల్కన్ రాకెట్ ద్వారా జీశాట్‌-20 ఉపగ్రహం పంపించారు. అంటే షార్ కేంద్రం నుంచి కేవలం అయిదు ప్రయోగాలు మాత్రమే చేశారు. ఇందులో మూడు పీఎస్ఎల్‌వీ, ఒక జీఎస్ఎల్‌వీ రాకెట్, ఒక ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్‌లను ప్రయోగించారు. ఏది ఏమైనా శ్రీహరికోటలో లాంచింగ్ సౌకర్యాలు పెరిగినప్పటికీ ఆ స్థాయిలో రాకెట్ ప్రయోగాలు నిర్వహించడంలో ఇస్రో వెనుక బడిందనే చెప్పాలి. ఎందుకంటే 2023, 2022లో ఎనిమిదేసి ప్రయోగాలు చేశారు. 2020, 2021లో కరోనా మహమ్మారి కారణంగా రెండేసి ప్రయోగాలు మాత్రమే చేపట్టారు. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా ప్రయోగాలు తక్కువనే చెప్పాలి.

రాయలచెరువులో 'డ్రాగన్ బోట్'



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువులో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, కెనాయింగ్, కయాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రస్థాయి డ్రాగన్ బోట్ పోటీలను ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కలసి బోట్‌లో పర్యటించారు. కెనాయింగ్, కయాకింగ్ అసోసియేషన్ చైర్మన్ ప్రదీప్ నాయుడు, శాప్ చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ ఈ శిక్షణలో ఎంపికైన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు చెప్పారు. కార్యక్రమరంలో సీక్యాప్ అసోసియేషన్ అధ్యక్షుడు బలరామనాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాపూరు : పట్టణంలోని పెట్రోల్ బంకు వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. స్థానిక దళితవాడకు చెందిన ఈశ్వరయ్య(45) ఇంటికి నడిచి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. క్షతగాత్రుడిని గూడూరు ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన జాతీయ నాటక పోటీలు



అవార్డు అందిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: సుబ్బరాజు నాట్య కళా పరిషత్ 65వ వార్షికోత్సవంలో భాగంగా మూడు రోజులుగా మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన జాతీయ నాటక పోటీలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు విజయవాడ అభ్యుదయ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'ఆంగికం భువనం యశ్య' నాటకం ప్రేక్షకులను అలరించింది. అనంతరం సుబ్బరాజు కళా పరిషత్ వారు ప్రదర్శించిన 'ఎస్ నేనే' నాటకం ఆకట్టుకుంది. అనంతరం నిర్వహించిన ముగింపు సమావేశానికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. కళా సంపదను భావితరాలకు అందించాల్సిన అవశ్యకత ఉందని తెలిపారు. ఈ క్రమంలోనే ధర్మవరం శ్రీదేవికి నాట్య శిరోమణి, పిళ్లా నటరాజ్‌కు నవరస నటనా దురంధర, డి.రామకోటేశ్వర రావుకు ఎన్‌టీఆర్ జీవిత సాఫల్య అవార్డు ప్రదానం చేశారు. కళాపరిషత్ ప్రతినిధులు గోపాల్‌రావు, ఆమూరి సుబ్రమణ్యం, కన్నప్పగారి కేశవులురెడ్డి, కోటేశ్వరరావు, యశోద పాల్గొన్నారు.

'తితిక్ష'కు ప్రథమ బహుమతి

కాకినాడకు చెందిన బీవీకే.క్రియేషన్స్ వారు ప్రదర్శించిన 'తితిక్ష' నాటిక ఉత్తమ ప్రదర్శనగా అశ్వ అవార్డుతో పాటు నగదు బహుమతిని అందుకుంది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా అనకాపల్లి శ్రీషిరిడి సాయి కల్చరల్ క్రియేషన్స్ వారు ప్రదర్శించిన 'ఆశ కదరా... శివ' నాటకం, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా హైదరాబాద్ సీఏఎంఎస్ వారు ప్రదర్శించిన అనగనగా ఒక రాజా, అనగనగా ఒక రాణి' బహుమతులు గెలుచుకున్నాయి.

శతావధానికి సత్కారం



భరత్ శర్మను సత్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్:తిరుపతి ఆర్ఎస్ మాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో శతావధాని భరత్ శర్మను ఆదివారం ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ తెలుగు, సంస్కృత భాషల ఖ్యాతిని ఖండాంతరాలలో విస్తరింపజేస్తున్న శతావధాని ఉప్పలదడియం భరత్ శర్మ తిరుపతి నగరానికి, తమ విద్యార్థిగా వర్సిటీకి గర్వకారణమని తెలిపారు. దుబాయి, యూఏఈలో పది రోజుల పాటు పర్యటించి వివిధ సాహిత్య వైదిక కార్యక్రమాలతో ఆదరణ పొంది తిరుపతికి చేరుకున్న భరత్‌శర్మకు జ్ఞాపిక అందించి అభినందించారు. ఈక్రమంలోనే రాయలసీమ రంగస్థలి వారు భరత్‌శర్మను శ్రీకృష్ణదేవరాయుల పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో సేవా కేంద్రం వ్యవస్థాపకుడు హనుమంతరావు,రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎస్ రాజా, ప్రసన్న లక్ష్మి, భాగవతుల జయలక్ష్మి, గొరిపెద్ది భగవాన్, తిరుమలయ్య, భాస్కర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, సురేష్ స్వామి, నారాయణ ఆచార్య పాల్గొన్నారు.

సన్‌డే శిక్షణలో.. హెడ్మాస్టర్లకు ఫన్‌డే



బెలూన్ గేమ్ ఆడుతున్న మహిళా హెడ్మాస్టర్లు



రన్నింగ్ రేస్ ఆడుతున్న హెడ్మాస్టర్లు

రామచంద్రాపురం: ఎప్పుడూ స్కూళ్లలో విద్యాబోధన, యాప్‌లలో ప్రభుత్వానికి వివిధ సమాచారం అప్‌లోడ్‌తో సతమవుతున్న ప్రధానోపాధ్యాయులకు శిక్షణతో ఒకింత ఆటవిడుపు లభించింది. గత ఏడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాల్ట్ పేరిట రాష్ట్రంలో టీచర్లు, హెడ్మాస్టర్లు, ఎంఈఓలకు ప్రారంభించిన శిక్షణా కార్యక్రమం ప్రస్తుత అధికార కూటమి పేరు మార్చి కొనసాగిస్తోంది. రీజనల్ స్థాయిలో లీడర్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం పేరిట మండలంలోని వెరిటాస్ సైనిక్ స్కూల్ వేదికగా 6వ విడత ప్రారంభించిన శిక్షణకు అన్నమయ్య, నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి ఈ పర్యాయం 182 మంది హెడ్మాస్టర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో 4వ రోజైన ఆదివారం షెడ్యూల్ ప్రకారం వివిధ అంశాలపై శిక్షణ ఇస్తూనే మధ్యమధ్యన ఆటపాటలు, కృత్యాలతో వారిలో జోష్ నింపారు.

సాక్షి క్లాసిఫైడ్స్



Education

DIRECT FINAL YEAR

Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA,Regular/lateral entry.9381287629



Real Estate

PLOTS FOR SALE

6 లక్షలకే తిరుపతి IISER అనుకొని ఫైనల్ అప్రూవ్ ప్లాట్లు అన్ని వసతులతో తక్కువ ధరకే డైరెక్ట్ ఓనర్, స్పాట్ రిజిస్ట్రేషన్, 9502774175, 7416211984.

PLOT FOR SALE

వకుళమాత గుడి వద్ద 85x145=342 అం॥ల కమర్షియల్ స్థలం అమ్మబడును

No Mediaters

సం/- 9866498834

RENT

రైల్వే కోడూరు టౌన్,రైల్వే స్టేషన్ రోడ్‌లో SBS బిల్డింగ్ ప్రక్కన గ్రౌండ్ ఫ్లోర్‌లో 34x105,(3570 Sqft)RCC Roof సిద్ధముగా నున్నది 1st Floor, 2nd Floor RCC (Each 6600 Sqft) నిర్మించగలము. Lift, 3Phase Power Supply కలదు, స్కూల్స్, కాలేజీలకు, షాపింగ్ మాల్స్‌కు, షోరూంలకు అనుకూలం కల్గిన బిల్డింగ్ Rent కు ఇవ్వబడును. ✆ 7020571709, 9885553613.

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact 9705444178 9951602970

BUSINESS SERVICE



BUSINESS OFFER

ప్రముఖ కంపెనీ అగ్రి, ప్రాపర్టీ, బిజినెస్ కొరకు ఏజెంట్స్ DMA, DSA కావలెను. మంచి జీతం & కమీషన్. ఫోన్ : 9518675529



Wanted

కంప్యూటర్ నాలెడ్జి కలిగిన లేడీ ఆపరేటర్ కావలెను. సంప్ర: Dhruti Creations, ప్రకాశం రోడ్డు,తిరుపతి, ఆసక్తిగలవారు బయోడేటాను వాట్సాప్ చేయగలరు. ✆ 73827 56650.

తిరుపతిలో ప్రముఖ రెస్టారెంట్‌లో పనిచేయుటకు దోస మాస్టర్ (24,000+రూం+భోజనం), గ్రైండింగ్ కొరకు (15K+రూం+భో.), టిఫిన్స్ మాస్టర్(24K +రూం+భో.) కావలెను. 8309558796.

ఉద్యోగ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారా మా MNC కంపెనీలో వర్క్ ఫ్రం హోం స్త్రీ పురుషులు కావలెను. Qul:10th-డిగ్రీ జీతం 20k-25k ఉచిత రూము భోజన సదుపాయం. 9110256233, 9036607717

ఆప్తా హోమ్ కేర్ హైదరాబాదు ఫిమేల్ & మేల్ కేర్‌టేకర్స్ కావలెను. జీతం: 18-20వేలు, సంవత్సరంలోపు 22-25కి పెరిగే అవకాశం. వయస్సు 20-45లోపు ఉచిత భోజన వసతి. 7680922316

పన్నులైన్స్ గారు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు. ఫ్రీ రూం+భోజనం. HYD. 9347197893

S/G Duty @ Nagari, residing at Pallipattu, Puthur, Thiruthani, 8Hrs +4 Off+Canteen Salary: 14K, X, Age: 25-45. SSF, Chennai-47. Ct:9840731203, 9384839540

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని దిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.